ప్రజాశక్తి

ఆదివారం 23 ఏప్రిల్ 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

వై.పాలెం ఘటనపై..

మూడు కేసులు నమోదు

- గాయపడిన వారి ఫిర్యాదు మేరకు టిడిపి వారిపై ఒకటి, వైసిపి వారిపై ఒక కేసు ..
- సభకు అనుమతి తీసుకొని నిబంధనలు పాటించని వ్యక్తిపై కూడా..: డీఎస్పీ

డీఎస్పీ కిషోర్‌కుమార్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలో ఈనెల 21న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనలో భాగంగా జరిగిన ఘటనల్లో మూడు కేసులు నమోదు చేసినట్లు మార్కాపురం డిఎస్పీ డాక్టర్ కిశోర్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన యర్రగొండపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసుల వివరాలు తెలియజేశారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 21న యర్రగొండపాలెంలో ▶ 2లో

మాట్లాడుతున్న మంత్రి సురేష్

రాళ్ల దాడిలో నిందితులకు శిక్ష పడేలా చేస్తా..

2లో

ఏఎస్పీకి అర్జీ ఇస్తున్న టిడిపి ప్రజాప్రతినిధులు, నేతలు

వైసీపీ రౌడీ మూకలను శిక్షించాలి

ఏఎస్పీకి టిడిపి వినతి

2లో



వై.పాలెంలో ఘటనపై మూడు కేసులు నమోదు

(మొదటిపేజీ తరువాయి)

జరిగే చంద్రబాబు పర్యటనలో భాగంగా వైసిపి కార్యకర్తలు శాంతి నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో 500 మంది పోలీసు బలగాలను యర్ర గొండపాలెంలో ఏర్పాటు చేశామన్నారు. ముందస్తుగానే మంత్రి సురేష్ క్యాంపు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి కార్యకర్తలను గుర్తించి.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వారికి హితబోధ చేశామన్నారు. అదే తరుణంలో యర్రగొండపాలెం నుంచి మంత్రి కార్యాలయం వైపు వస్తున్న టిడిపి కార్యకర్తలను కట్టడి చేసి.. అక్కడికి రాకుండా జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బోడిరెడ్డిపల్లి జంక్షన్ నుంచి యర్రగొండపాలెం వస్తున్న క్రమంలో మంత్రి సురేష్ క్యాంపు కార్యాలయం దగ్గరకు రావడంతో అక్కడే వేచి ఉన్న టిడిపి కార్యకర్తలు కూడా ఆ కాన్వాయ్‌తో కలిశారన్నారు. అక్కడ ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసు బలగాలతో కట్టడి చేశామన్నారు. అయినప్పటికీ రాళ్లు రువ్వుకున్న ఘటనలో టిడిపి, వైసిపి కార్యకర్తలకు గాయాలైనట్లు తెలిపారు. గాయాలైన వారి ఫిర్యాదు మేరకు టిడిపిపై ఒక కేసు, వైసిపిపై ఒక కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సభ నిర్వహించడానికి ఒక చోట అనుమతి తీసుకొని అక్కడ నిర్వహించకుండా ఎన్టీఆర్ బొమ్మ సెంటర్‌లో నిర్వహించడంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిందన్నారు. దీంతో పోలీసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సభ నిర్వాహకులు అనుమతి తీసుకున్న వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్ఎస్‌జి అధికారుల నుంచి తమకు ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదన్నారు. ఫిర్యాదు అందితే దానిపై కూడా కేసు నమోదు చేసి విచారిస్తామన్నారు. కార్యక్రమంలో సిఐ మారుతీకృష్ణ, ఎస్ఐ జి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల చెట్ల మధ్యలో బైకు ..

టంగుటూరు : మండల పరిధిలోని జమ్ములపాలెం కాలనీ, వెస్ట్ కాలనీకి వెళ్లే సిమెంట్ రోడ్డుకు సమీపంలో ముళ్ల చెట్ల మధ్య వారం రోజులుగా ఓ బైకు ఉంది. ఈ బైకుకు నెంబర్ ప్లేట్ కూడా లేదు. వాహనాన్ని ఎవరైనా చోరీ చేసి తెచ్చి ఇక్కడ వదిలేసి వెళ్లారా.. లేదా మరేమైనా కారణమా అని జమ్ములపాలెం కాలనీవాసులు చర్చించుకుంటున్నారు. ఎవరిదైనా సొంత వాహనం అయితే జాగ్రత్తగా భద్రపరచుకుంటారని, ఇలా పిచ్చి చెట్ల మధ్య ఉంచాల్సిన అవసరం ఏముంటుందని చర్చించు కుంటున్నారు. పోలీసులు దృష్టి సారించి గుర్తుతెలియని ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టాలని జమ్ములపాలెం కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నియామక పత్రం అందజేత

టంగుటూరు : యాదవుల అభివృద్ధి కోసం యాదవ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించేలా రాజకీయ పార్టీలకతీతంగా యాదవులందరూ ఐక్య పోరాటం చేయాలని టంగుటూరు మండలం వల్లూరు గ్రామానికి చెందిన యాదవ జెఎసి జిల్లా అధ్యక్షుడు చిరుమామిళ్ల గోపికృష్ణ తెలిపారు. చల్లగొలుసుల బాలగురవయ్యను జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించారు. అందులో భాగంగా జెఎసి వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియం శ్రీనివాసులు, గోపికృష్ణ చేతుల మీదుగా బాలగురవయ్యకు శనివారం నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దూళ్ల అప్పారావు, పొడమేకల వెంకటేశ్వర్లు, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగనన్న'

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని మిట్టపాలెం గ్రామంలో నువ్వే మా నమ్మకం జగనన్న కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకుడు గోగినేని వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచి బొడ్డు అంకయ్య ,ఉపసర్పంచి మండల మాలకొండయ్య ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు మెంబర్లు, గృహసారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టును

అక్టోబరులో సిఎం జగన్ ప్రారంభిస్తారు

- చంద్రబాబుకు అవకాశం ఇవ్వం
- మంత్రి,ఎమ్మెల్యేలను కించపరిచేలా వ్యాఖ్యానించడం తగదు
- వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

మాట్లాడుతున్న వెంకటరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

వెలిగొండ ప్రాజెక్టు విషయంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పే మాటలను జనం నమ్మే పరిస్థితిలో లేరని వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి చెప్పారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని తన నివాస గృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడు 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు. ఆయన కాలంలో వెలిగొండ పనులు ఎంతమేర పూర్తి చేశారో చెప్పాలన్నారు. 1996 మార్చి 5న వెలిగొండ ప్రాజెక్టుకు చంద్రబాబు శంకుస్థాపన చేశారని, ఆ తరువాత పట్టించుకోలేదన్నారు. దివంగత నేత డాక్టర్ రాజశేఖరరెడ్డి ప్రాజెక్టుల బాటలో భాగంగా వెలిగొండను సందర్శించినట్లు తెలిపారు. రాజశేఖరరెడ్డి సిఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత మాత్రమే వెలిగొండ ప్రాజెక్టు కార్యరూపం దాల్చిందన్నారు. 70 శాతం పనులు ఆయన కాలంలో పూర్తి అయినట్లు తెలిపారు. మూడు గ్యాప్‌లతో పాటు రెండు సొరంగాలు మొదలు పెట్టింది డాక్టర్ రాజశేఖరరెడ్డేనని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు కోసం అనేక సార్లు అసెంబ్లీలో తాము ప్రస్తావించినా.. నీరెక్కడ... నిధులెక్కడ అని చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మొదటి సొరంగాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. రెండవ సొరంగం కూడా త్వరలో పూర్తవుతుందన్నారు. వచ్చే అక్టోబరులో వెలిగొండ ప్రాజెక్టును సిఎం జగన్ ప్రారంభిస్తారన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ అవకాశం చంద్రబాబుకు ఇవ్వబోమని చెప్పారు. రెండవ సొరంగం పనులు సాంకేతికంగా జాప్యం జరిగిందే తప్ప మరొకటి కాదన్నారు. బోరింగ్ మిషన్ మరమ్మతులకు గురి కావడం అందుకుకారణ మన్నారు. ఇప్పటికిప్పుడు ఇతర దేశాల నుంచి మిషన్ తెప్పించడం... తవ్వడం సాధ్యం కాదని... కొద్దిగా మిగిలిన సొరంగ మార్గాన్ని మాన్యువల్‌గా పూర్తి చేస్తున్నట్లు ఎలిపారు. చంద్రబాబుకాలంలో వెలి గొండ ప్రాజెక్టును ఆదాయ వనరుగా మార్చుకున్నారన్నారు. బిటెక్ రవికి పనులు అప్పగించి టిడిపి ముడుపులు దండుకోవడం జరిగిందన్నారు. మూడు గ్యాప్‌లు, సొరంగం పూర్తయితే మూడు జిల్లాల పరిధిలో 4.38 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరు అందుతాయని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్నందున వెలిగొండ ప్రాజెక్టు పేరుతో ఓట్లు దండుకోవాలనుకోవడం చంద్రబాబు అవివేకమన్నారు. ఈ ప్రాంత ఓటర్లు చంద్రబాబు మాటలు నమ్మరన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ జిల్లాలో అన్ని స్థానాలు తామే గెలుస్తామన్నారు.

పశ్చిమ ప్రాంతంలో చంద్రబాబు పర్యటన రెచ్చగొట్టేలా ఉందని జంకె వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. గిద్దలూరులో ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబును అహంకారి, పొగరుబోతు అనడం సరికాదన్నారు. మార్కాపురంలో కూడా ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి కుటుంబ సభ్యుల విషయంలోనూ అదే విధంగా వ్యవహరించారన్నారు. యర్రగొండపాలెంలో మంత్రి సురేష్‌పై, అక్కడి ప్రజలను రెచ్చగొట్టేలా చంద్రబాబు వ్యవ హరించారన్నారు. సహచర ఎమ్మెల్యేలను ఎలా గౌరవించాలో సీనియర్ అని చెప్పుకునే చంద్రబాబుకు తెలియకపోవడం దౌర్భాగ్యమన్నారు.

'వెలిగొండ'కు శంకుస్థాపన చేసింది చంద్రబాబే

- అటవీశాఖ అనుమతి సాధించింది మేమే.
- మాజీ ఎమ్మెల్యే కందుల

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

వెలిగొండ ప్రాజెక్టుకు టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 1996లో శంకుస్థాపన చేశారని, తరువాత ప్రాజెక్టులో కీలకమైన అటవీ అనుమతులు తెచ్చిన ఘనత కూడా చంద్రబాబుదేనని టిడిపి మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని తన నివాస గృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కందుల నారాయణరెడ్డి మాట్లాడారు. అటవీ అనుమతులు రావడంతో ప్రాజెక్టు పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. తొమ్మిది సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ప్రాజెక్ట్ పూర్తి చేయలేక పోయిందని, అదే నాయకులు ఇప్పుడు వైసిపిలో ఉన్నారన్నారు. 2019లో ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే ఏడాదిలో వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తామని తప్పుడు వాగ్దానం చేసిన జగన్ మోహన్‌రెడ్డి అని అన్నారు. నాలుగేళ్ల పాలనలో వెలిగొండకు చేసిందేమీ లేదన్నారు.

జిల్లాల పునర్విభజనలో 25 పార్లమెంటు స్థానాలు ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో 26 జిల్లాలు ఏర్పాటు చేశారని, ఈ ప్రాంత వైసిపి నాయకులు మార్కాపురం జిల్లా కోసం ఎందుకు నోరు మెదపరని ప్రశ్నించారు. మార్కాపురం సభలో చంద్రబాబుం ాయుడు మార్కాపురం ప్రత్యేక జిల్లా ఇస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారని, వచ్చే తెలుగుదేశం ప్రభుత్వంలో మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయడం ఖాయమన్నారు.. మార్కాపురం నియోజకవర్గంలో జరుగుతున్న భూ కబ్జాలను చంద్రబాబు ప్రస్తావించారని, అవి మీ వైసిపి నాయకుడే... మార్కాపురం నియోజక వర్గంలో రూ. 1000 కోట్ల మేర భూ కబ్జాలు జరిగాయి అంటూ ఆరోపణలు చేయలేదా అని ప్రశ్నించారు. సమయం వచ్చి నప్పుడు అన్నింటినీ బయట పెడతామని అన్నారు. వైసిపి నాయకులు తనపై వ్యక్తిగత దూషణలు చేస్తున్నారని, వారి విచక్షణకే వదిలేస్తున్నట్లు చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మూడు రోజుల పర్యటనను దిగ్విజయం చేసినందుకు అందరికీ కందుల నారాయణరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

ప్రకాశం జిల్లా, తాళ్లూరు మండలం, తాళ్లూరు గ్రామం, మార్కాపురం గ్రామ నివాసి మల్లవరపు వెంకట సుజాత భర్త మారం వెంకట రమణారెడ్డి ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందీ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని నా క్లయింట్ భర్త గారైన మారం వెంకట రమణారెడ్డి తండ్రి చిన్న రామిరెడ్డి తన పూర్వీకుల ద్వారా సంక్రమించబడి, నా క్లయింట్ పేరు మీద ఒక సెటిల్మెంట్ దస్తావేజును వ్రాయించి దర్శి సబ్‌రిజిష్టర్ వారి ఆఫీస్‌లో రిజిష్టర్ కాబడిన దస్తావేజు నెంబరు 2501/2022 ద్వారా నా క్లయింట్‌కి సంక్రమించబడి తదాది నా క్లయింట్ సంపూర్ణ హక్కుభుక్తములు కలిగియున్నారని మరియు దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని "కెన్‌ఫిన్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్" ఒంగోలు వారి వద్ద తనఖా ఉంచి ఋణం తీసుకొనుచున్నారు. కావున ఎవరికైనను, సదరు ఆస్తి గురించి గాని, హక్కుల గురించి గాని అభ్యంతరాలు వున్న యెడల లిఖిత పూర్వకంగా తగిన దస్తావేజులతో ఈ నోటీసు ప్రకటించిన (ఏడు) దినముల లోపు, ఈ క్రింది సంతకం దారుని సంప్రదించగలరు. లేనియెడల ఎవ్వరికీ ఏవిధమైన అభ్యంతరాలు గాని, హక్కులు గాని లేవని భావించి మా క్లయింట్ దగువ షెడ్యూలు ఆస్తిపై ఋణము తీసుకోనగలరు. గడువు తరువాత వచ్చు అభ్యంతరాలును మా క్లయింట్ గాని రుణదాతను కానీ సిద్ధపరచజాలవని యావన్మందికి తెలియజేయుటమైనదీ.

షెడ్యూల్: ప్రకాశం జిల్లా, మార్కాపురం సబ్ రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, దర్శి సబ్ డిస్ట్రిక్ట్, తాళ్లూరు మండలం, మార్కాపురం గ్రామపంచాయితీ, మార్కాపురం గ్రామ సర్వే నెంబర్ 166.1, ప్రస్తుతం మార్కాపురం మజరా రాజానగరంలో చేరిన రెసిడెంటల్ ఏరియా విస్తీర్ణం 169.4 చ.గ. కాళీస్థలంకు హద్దులు: తూర్పు: రాకపోకల రోడ్డు, పడమర: మెడగం శ్రీనివాసరెడ్డి గారి ఇల్లు, ఉత్తరం: రాకపోకల రోడ్, దక్షిణం: మారం అంజిరెడ్డి గారి ఇల్లు ఈ హద్దులలో 169.4 చ.గ. లేదా 1524.60 చ.అ. గా గల ఖాళీ స్థలమునకు సంబంధించి యావత్తు రాకపోకలుతో సహా.

శిఖాకొల్లి రమేష్, న్యాయవాది,
ఎ-బ్లాక్, 4వ ఫ్లోర్, షాప్ నెం. 5(ఎ) గుప్తాస్ స్క్వేర్, 60 ఫీట్ రోడ్, ఒంగోలు, ప్రకాశం జిల్లా,
ఫోన్: 99491 36259

దుస్తులు అందజేత

గిద్దలూరు రూరల్ : గిద్దలూరు పట్టణ పరిధిలోని పిఆర్ కాలనీలోనున్న సంజీవిని అనాధాశ్రమంలోని అనాధలు, వద్ధులకు రంజాన్ పండుగ సందర్భంగా శనివారం దుస్తులు అందజేశారు. స్థానిక శ్రీ వివేకానంద కళాశాల 1983 –88 సంవత్సరాల్లో చదివిన పూర్వ విద్యార్థులు దుస్తులు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ వృద్ధులకు సేవలు అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హను మంతరెడ్డి, తులసిబాబు, సూర్య, సుబ్బరాయుడు, గజ్జ శ్రీని వాసులు, దుర్గా, రంగస్వామి రెడ్డి, రామకృష్ణారెడ్డి ,మోహన రావు ,సింగర్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు ప్రసాదు,ఖాదరవల్లి ,కొండలరావు ,నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

ప్రకాశం జిల్లా, తాళ్ళూరు మండలం, తాళ్ళూరు మజారా కొత్తపాలెం గ్రామ కాపురస్తుడు ఇడమకంటి సుబ్బారెడ్డి గారి కుమారుడు అనిల్‌కుమార్ రెడ్డి తండ్రి మాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మంది ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలియచేయునదిఏమనగా పూర్వములో ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి కోట కోటీశ్వరరెడ్డి గారి పూర్వీకుల ద్వారా సంక్రమించబడి వారి అనంతరం వారి కుమారుడయిన కోట వెంకారెడ్డి గారికి సంక్రమించబడి వారి హక్కు అనుభవములో వున్న ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని వారు నా క్లయింటు విక్రయించి క్రయపత్రమును దరిశి సబ్ రిజిష్టారు వారి ఆఫీసులో దస్తావేజు నెం. 3499/2022 గా రిజిష్టరు చేసి స్వాధీనపరచినారని, తదాది నా క్లయింటు అయిన ఇడమకంటి అనిల్‌కుమార్ రెడ్డిగారు సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములతో అనుభవిస్తున్నారు. నా క్లయింటు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని "కెన్‌ఫిన్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్" ఒంగోలు వారి వద్ద తనఖా ఉంచి ఋణము తీసుకొనుచున్నారు. కావున ఎవరికైనను సదరు ఆస్తి గురించి గాని, హక్కుల గురించి గాని అభ్యంతరములు ఉన్న ఎడల లిఖితపూర్వకముగా తగిన దస్తావేజులతో ఈ నోటీసు ప్రచురించబడిన '7' (ఏడు) దినముల లోపు ఈ క్రింది సంతకం దారుని సంప్రదించగలరు. లేనియెడల ఎవరికి ఎటువంటి అభ్యంతరములు గాని, హక్కులు గాని లేవని భావించి మా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిపై ఋణము తీసుకొనగలరు. గడువు తరువాత వచ్చు అభ్యంతరములు, మా క్లయింటును గాని, ఋణదాతను గాని బద్ధపరచజాల వని యావన్మందికి తెలియచేయడమైనది.

షెడ్యూలు: ప్రకాశం జిల్లా ఒంగోలు రి.డి. దరిశి స.డి.లోని తాళ్ళూరు మండలం, తాళ్ళూరు గ్రామపంచాయితీ ఏరియాలోని తాళ్ళూరు గ్రామ సర్వే నెం.171రు గల మెరకపూరాలోని ప్రస్తుతం తాళ్ళూరు గ్రామములో చేరిన 08వ వార్డు పడమర కొత్తపాలెం ఖాళీస్థలము యం0-05.3/4 ట్లు లేక 278.3 చ॥గ॥లు గల ఖాళీ స్థలమునకు హద్దులు. తూర్పు: మేడగం సుబ్బారెడ్డి, కాట్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి గార్ల స్థలము, దక్షిణం: మారం కోటిరెడ్డి గారి ఇల్లు, పడమర : సి.సి. రోడ్డు, ఉత్తరం: కోట నాగేశ్వరరెడ్డి గారి ఇల్లు. ఈ హద్దులకు లోనైన యం0-05.3/4 ట్లు లేక 278.3 చ॥గ॥లు స్థలము.

చల్లా వెంకటప్పారెడ్డి, న్యాయవాది,
డోర్ నెం. 24-1-19, పాత గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురు,
ఒంగోలు, ప్రకాశం జిల్లా, ఫోన్: 98480 44909

మహారాజశ్రీ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం:32/2022
ఇన్
ఓ.ఎస్.నెం:64/2020

విక్రమ్ వెంకటేశ్వర్లు .....డి.హెచ్.ఆర్.
వర్సెస్
1.మేకం రమాదేవి మరియు వగైరాలు ..జె.డి.ఆర్స్

వేలం ప్రకటన

పై నెంబరు అమలు దరఖాస్తు బాకీ ని రాబట్టు కొనుటకు గాను పై నెంబర్ జెడిఆర్ ల స్వాధీన అనుభవంలో ఉన్న లేట్ మేకం గురవయ్య కు హక్కు గల ఈ క్రింది షెడ్యూలు దాఖలు స్థిరాస్తిని శ్రీ కోర్టు వారి ఎదుట తేదీ: 11-05- 2023 ఉదయం గం.10:30 ని. నుండి సాయంత్రం 5:00 లోగా బహిరంగ వేలం వేయబడును. పాడదలచిన వారు కోర్టు షరతుల ప్రకారం వేలంలో పాల్గొన వచ్చును.

షెడ్యూలు

ప్రకాశం జిల్లా, మార్కాపురం డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్, పొదిలి సబ్ రిజిస్ట్రేషన్, మర్రిపూడి మండలం, చిలంకూరు గ్రామం, స. నెం :224/4, విస్తీర్ణం య.1-48సెంట్లు మెట్ట భూమి హద్దులు.
తూర్పు : మాలపల్లె వారి భూమి.
దక్షిణం : అలుగు వాగు.
పడమర : వీరెళ్ళ కోటయ్య గారి భూమి.
ఉత్తరం : వీరెళ్ల కోటయ్య గారి భూమి.
డి.హెచ్.ఆర్ విలువ రూ.1,95,000/-
అమీనా విలువ రూ.2,20,000/-
వేలం తేదీ :11-052023
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు
తాడికొండ రామమోహన్‌రావు,
డి.హెచ్.ఆర్ తరుపు అడ్వకేట్, పొదిలి,
సెల్ :9885636729.

16వ డివిజన్‌లో వామపక్షాల ప్రచార భేరి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బిజెపిని సాగనంపుదాం, దేశాన్ని కాపాడుకుందామని సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఇంటింటికీ కరపత్ర ప్రచారభేరి కార్యక్రమాన్ని ఒంగోలు నగరంలోని 16వ డివిజన్ అశోక్‌నగర్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ బిజెపి రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా వ్యతిరేక విధానాలను దూకుడుగా అమలు చేస్తోందన్నారు. గ్యాస్ బండను గుదిబండగా మార్చి, విద్యుత్ బిల్లుతో షాకులు కొట్టిస్తూ సామాన్యుల బతుకుల్ని, పెట్రోల్, డీజిల్ మంటల్లోకి నెట్టే పరిస్థితి కల్పిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. నేడు సామాన్య ప్రజలు, పేదలు, మధ్యతరగతి ప్రజానీకంపై విపరీతమైన భారాలు వేసి వివిధ రకాల పన్నుల పేరుతో ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. ప్రజల ఆదాయాలు తగ్గిపోతూ నిత్యావసర ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడంలో వైఫల్యం చెంది, ప్రజల నుంచి రాబట్టేందుకు పన్నులు రూపంలో పెంచుతున్నారని తెలిపారు. బిజెపి ప్రజా వ్యతిరేక

కరపత్రాలను పంచి ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నేతలు

విధానాలకి, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికి తిరుగుతూ రాజకీయ ప్రచార భేరీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆలోచించి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న విధానాలను వ్యతిరేకించాలని కోరారు. కేంద్ర మద్దతుతో రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని కోరారు. ఈనెల 27న ఒంగోలు నియోజకవర్గ రాజకీయ ప్రచారభేరి సభ కార్యక్రమం ఉంటుందని, ఆ సభను ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏ శ్రీనివాసులు సిపిఎం ఒంగోలు నగర కమిటీ సభ్యులు ఏ శ్రీనివాసులు, సిపిఎం బాలాజీ నగర్ ఏరియా నాయకులు టి భానుమూర్తి, టి మురళి, కుమారి, బాబురావు పాల్గొన్నారు.

వసతి గృహంలో ధరిత్రీ దినోత్సవం

ప్రజాశక్తి-వేటపాలెం

పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ధరిత్రీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి అధ్యక్షులు పత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ భూమి యొక్క ఉష్ణోగ్రత, పెరుగుదల నియంత్రించే కార్యక్రమం, ఖనిజ సంపద వినియోగం, ఇంధన వాడకం, మొక్కల పెంపకం, వృక్ష సంపద వినియోగం, రీసైక్లింగ్ అయ్యే వస్తువుల వినియోగం, విద్యుత్ వినియోగం విషయాలలో తీసుకోవలసిన, అవలంబించవలసిన విధానం, భాధ్యతను తెలియజేశారు. విద్యార్థులతో ప్రమాణం చేయించి, రాబోయే కాలంలో వారు పెద్దయ్యాక తీసుకోవలసిన జాగ్రత్తలు, నిర్ణయాలను నిర్దేశించారు. విద్యార్థులు ప్రమాణం చేస్తూ నీటిని పొదుపుగా వినియోగిస్తామని, రీసైక్లింగ్ వస్తువులు వినియోగిస్తామని, మొక్కల పెంపకం, వృక్ష

విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న పత్తి వెంకట సుబ్బారావు

సంపదను కాపాడతామని, ఇంధన వినియోగం తగ్గించి ఆరోగ్య సూత్రంగా సైకిల్ వాడకం, విద్యుత్తు వినియోగంలో పొదుపు, చేతి గుడ్డ సంచులు వినియోగిస్తామని, ఆహార వినియోగంలో ధరణిపై పండిన వస్తువులను పొదుపుగా వినియోగిస్తూ, శాఖాహారులుగా ఉంటూ భూమి పరిరక్షణకు పాటుపడతామని ప్రమాణం చేస్తూ, కట్టుబడి ఉంటాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ఎస్‌విఎల్ ప్రసాద్, మస్తాన్‌రెడ్డి, శేఖర్, సేవక్ సుబ్రహ్మణ్యం, లక్ష్మి, మౌనిక పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు కృష్ణ చైతన్య సాయం

ప్రజాశక్తి-పంగులూరు

కోటపాడు గ్రామంలోని దళిత కాలనీలో అగ్ని ప్రమాదం జరిగి ఇళ్లు కోల్పోయిన బాధితులను శనివారం వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, శాప్ నెట్ చైర్మన్ బాచిన కష్ణ చైతన్య పరామర్శించారు. లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల, గత సోమవారం కోటపాడు దళిత కాలనీలో నాలుగు ఇళ్లు, ఒక వరిగడ్డి వామి దగ్ధమైన విషయం పాఠకులకు తెలిసిందే. బాధితులకు శనివారం సాయంత్రం కృష్ణ చైతన్య కలిసి పరామర్శించి, అనంతరం ఆర్థిక సాయం అందించారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంటి సామగ్రిని కూడా కృష్ణ చైతన్య అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎక్కడ ఎవరికి ఏ ఇబ్బంది జరిగినా, తాము అండగా ఉంటామని అన్నారు. ముఖ్యంగా పేదలకు తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అభివద్ధి కమిటీ అధ్యక్షులు రాయిని వెంకట సుబ్బారావు, వైసీపీ మండల కన్వీనర్ ఎర్రం శ్రీనివాస్‌రెడ్డి, బాపట్ల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఎంసి మెంబర్, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బీవీ కృష్ణారెడ్డి, అద్దంకి అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఎర్రమోతు రమేష్‌బాబు, కోటపాడు గ్రామ మాజీ సర్పంచ్ ఎర్రం గోపాల్‌రెడ్డి, అద్దంకి ఏఎంసీ మాజీ డైరెక్టర్ షేక్ సుభాని, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు కోల్పోయిన వారికి ఆర్థిక సహాయం అందిస్తున్న బాచిన కృష్ణ చైతన్య

కర్నూలు జిల్లా వాసి దోర్నాలలో మృతి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల: కర్నూలు జిల్లా వాసి దోర్నాలలో మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. కర్నూలు జిల్లా బాలాజీ నగర్‌లో నివాసం ఉండే కేశవరెడ్డిగారి శివారెడ్డి(69) అనే వ్యక్తి దోర్నాల పట్టణంలోని మల్లికార్జున నగర్ సమీపంలో హోటల్ వెనుక వైపున చిల్ల చెట్లలో మృతి చెంది పడిఉన్నాడు. అయితే రెండు, మూడు రోజుల క్రితమే మృతి చెందినట్లు కనిపిస్తోంది. శవమంతా ఉబ్బి దుర్వాసన వస్తోంది. ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మృతి చెందిన శివారెడ్డి

పది మంది జూదరులు అరెస్ట్

ప్రజాశక్తి-వేటపాలెం

మండల పరిధిలోని పుల్లరపాలెం పంచాయతీ రామచంద్రపురం గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. పదిమంది జూదరులను అరెస్టు చేసి రూ.24,300 పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పదిమంది జూదరులను కోర్టుకు హాజరుపరచనున్నట్లు వేటపాలెం ఎస్ఐ జి సురేష్ తెలిపారు.

సెలవు రోజుల్లోనూ ల్యాండ్ కన్వర్షన్ పరిశీలన

ప్రజాశక్తి-వేటపాలెం

216 జాతీయ రహదారి. స్థానిక డిగ్రీ కాలేజ్ జంక్షన్ వద్ద మండల రక్షణ నిలయం అధికారి ఎండకు పుచ్చకాయ ముక్క తింటూ సేదతీరుతున్నారు. జంక్షన్ నుంచి వేటపాలెం కుందేరు మార్కెట్ రోడ్డు వైపు బైక్‌పై విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ రివ్వున దూసుకెళుతున్నారు. బైక్ వెనుక మండల ఇన్‌ఛార్జి తహశీల్దారు, చీరాల రెవెన్యూ డివిజినల్ అధికారి కార్లు ఒకదాని వెనుక ఒకటి పరుగులు తీస్తున్నాయి. శనివారం మిట్ట మధ్యాహ్నం పన్నెండు గంటలకు జంక్షన్ వద్ద సేదతీరుతున్నా అధికారితో మాట్లాడుతున్న ప్రజాశక్తికి ఈ దృశ్యం అగుపించింది. రంజాన్ పండుగ సెలవు రోజున ఈ అధికార్ల ఉరుకులు, పరుగుల గురించి ఆరా తీసేందుకు ప్రయత్నించింది. సెలవు రోజు కూడా విశ్రాంతి లేకుండా ఈ అధికారులు పనులను చక్కదిద్దు కొంటున్నారు. విషయం

వేటపాలెం జీడిబట్టిల దగ్గర అర్జీదారునితో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ఆర్ఐ, విఆర్‌ఏ

ఏమిటని ఆరా తీస్తే రామన్నపేట పంచాయతీ ఇందిరా కాలనీ పరిధిలోని ఇండస్ట్రియల్ ఏరియాలో ఒక వ్యక్తికి ల్యాండ్ కన్‌వర్షన్ కోసం వచ్చిన అర్జీని పరిశీలన నిమిత్తం వచ్చినట్లు తహశీల్దారు గరిక మహేశ్వరి ప్రజాశక్తికి ఫోన్‌లో బదులిచ్చారు. ఆర్‌డిఒకు ఫోన్ కాల్ రావడంతో వెను తిరిగారని వివరించారు. ఆర్‌డిఓ సరోజిని స్థలం పరిశీలించకుండానే వెనుతిరగడం పట్ల అర్జీదారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సెలవు రోజు అందుబాటులో ఉన్న తహశీల్దారు కార్యాలయ అనధికార విధులు నిర్వహించే గ్రామ నౌకరు, ఇన్‌ఛార్జి ఆర్‌ఐలకు మండల, డివిజనల్ అధికారుల ఆదేశాలు పాటిస్తూ ముందుకుసాగారు. పని దినాల్లోనే కాకుండా సెలవు రోజుల్లో కూడా సామాన్యుల ల్యాండ్ కన్‌వర్షన్ అర్జీల పరిష్కారానికి పనిగట్టుకొని అధికార యంత్రాంగం కదిలి రావడం పట్ల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. తాము కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పనులు కావడం లేదని సామాన్యులు ముక్కున వేలేసుకోవడం విశేషం.

చనిపోయిన జీవాలను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు మెట్టు శ్రీనివాసరెడ్డి తదితరులు

పిడుగుపడి 19 జీవాలు మృతి

ప్రజాశక్తి-పెద్దారవీడు

మండలంలోని శుక్రవారం రాత్రి పెనుగాలులు వీయడంతోపాటు పిడుగులు పడ్డాయి. ఈ క్రమంలో మండలంలోని కర్రోల గ్రామంలో పిడుగుపడి కోనంగి పాలంకయ్యకు చెందిన 19 గొర్రెలు, మేకలు మృతి చెందాయి. గొర్రెల ఖరీదు సుమారు రూ.3 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ మెట్టు శ్రీనివాసరెడ్డి, మాజీ కన్వీనర్ గొట్టం శ్రీనివాసరెడ్డి, గుమ్మ గంగరాజు, పెద్దారవీడు మండల మాజీ జడ్‌పిటిసి జడ్డా రవిలు బాధితుడ్ని పరామర్శించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-మద్దిపాడు

జాతీయ రహదారిపై వెల్లంపల్లి ఆవాస్ రిసార్ట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన శనివారం సాయంత్రం జరిగింది. పోలీసులు, స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. కీర్తిపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని గాజులపాలేనికి చెందిన బైరెడ్డి నాగిరెడ్డి(30) గాజులపాలెం నుంచి ద్విచక్ర వాహనంపై తన వదిన, ఆమె ఇద్దరు పిల్లలు కలసి ఒంగోలు వెళుతూ ఆవాస్ రిసార్టు వద్ద రోడ్డు పక్కనున్న గ్రిల్స్‌ను ఢీకొట్టాడు. దీంతో తలకు దెబ్బ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. నాగిరెడ్డి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవలే కులాంతర వివాహం చేసుకున్నాడని బంధువులు తెలిపారు. పోలీసులు ఘటన స్థలం చేరుకొని వివరాలు సేకరించారు.

మృతిచెందిన నాగిరెడ్డి

బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్న రేణింగవరం ఎస్ఐ తిరుపతిరావు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

రేణింగవరం ఎస్ఐ తిరుపతిరావు

ప్రజాశక్తి-పంగులూరు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రేణింగవరం ఎస్ఐ కేకే తిరుపతిరావు అన్నారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రమైన పంగులూరు గ్రామంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న కొంతమందిని తిరుపతిరావు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల వెంబడి బహిరంగ ప్రదేశాల్లో కొంతమంది మద్యం సేవిస్తూ ప్రజలకు ఆటంకం కలిగిస్తున్నారని, కొంతమంది విచ్చలవిడిగా మద్యం సేవిస్తూ నిబంధనలను అతిక్రమిస్తున్నారని అన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇందుకోసం తాను ప్రతిరోజూ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఆటోలో అత్యధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకొని ప్రయాణం చేస్తున్నారని, అలాంటి వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్సు లేకుండా ప్రయాణించే వారిపై కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవాన్ని జయప్రదం చేయండి
దొంతిబోయిన సీతారామిరెడ్డి

ప్రజాశక్తి-కర్లపాలెం

మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవ సభను విజయవంతం చేయాలని వైసిపి మండల కన్వీనర్, కాబోయే మార్కెట్ యార్డ్ చైర్మన్ సీతారామిరెడ్డి కోరారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కర్లపాలెం నుంచి ఆదివారం ఉదయం 10 గంటలకు పెద్దింటమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కర్లపాలెం ఐలాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని తెలిపారు. అనంతరం భారీఎత్తున ర్యాలీగా బయలుదేరి బాపట్ల పట్టణంలోని ఆర్టీసీ గ్యారేజ్ దగ్గర ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించి బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతితో భారీ ర్యాలీగా మార్కెట్ యార్డ్ దగ్గరకు చేరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కర్లపాలెం మండలం నుంచి వైసిపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపిడిఒ రాధాకృష్ణ

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని బాపట్ల ఎంపీడీవో రాధాకృష్ణ అన్నారు. శనివారం బాపట్ల మండలం ముత్తాయిపాలెం గ్రామ సచివాలయం రోడ్ వద్ద బాటసారుల కోసం చలివేంద్రంను ఆయన ప్రారంభించారు. ప్రజలు కార్యాలయం పనుల నిమిత్తం వచ్చే వారికి, అలాగే బాటసారులకు ఉపయోగపడుతుంది. అని, ఇందుకు చొరవ చూపి చలివేంద్రం ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ వారికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ శరత్‌బాబు, మండల సచివాలయ కన్వీనర్ వడ్డిముక్కల డేవిడ్, గ్రామ పంచాయతీ సెక్రటరీ కాసాని ఝాన్సీ లక్ష్మి, గ్రామ పెద్దలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

నేడు సిఐటియు మండల మహాసభ

ప్రజాశక్తి-పంగులూరు

సిఐటియు పంగులూరు మండల మహాసభ ఆదివారం ఉదయం 10 గంటలకు, పంగులూరులో జరుగుతుందని సిఐటియు మండల కార్యదర్శి గుడిపాటి మల్లారెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభకు సిఐటియు బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, భవన నిర్మాణ కార్మికులు, మధ్యాహ్న భోజనం కార్మికులు, స్వచ్ఛభారత్ కార్మికులు, కాంట్రాక్టు ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు అందరూ హాజరై, ఈ మహాసభను జయప్రదం చేయాలని మల్లారెడ్డి కోరారు.

పది స్పాట్‌లో మృతులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

పదో తరగతి స్పాట్ వాల్యూ్యషన్లో మరణించిన సిబ్బందికి రూ.50 లక్షలు పరిహారం వెంటనే ప్రభుత్వం అందించాలని రాష్ట్ర ఎయిడెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు పిడపర్తి పేరిరెడ్డి ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మరణించిన కుటుంబ సభ్యుల్లో ఒకరికి వెంటనే ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరణించిన ఉపాధ్యాయునికి సంబంధించిన గ్రాట్యూటీ, పెన్షన్ సౌకర్యాలకు సంబంధించిన అన్ని బకాయిలు 15 రోజుల్లోపు వారి కుటుంబ సభ్యులకు అందేలా తగిన ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే సిబ్బందికి ఎటువంటి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు లేదు. ఎయిడెడ్ సిబ్బందికి హెల్త్‌కార్డు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి-బాపట్ల

ముస్లిములు రంజాన్ పండుగ వేడుకలను శనివారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పట్టణంలోని ఇస్లాంపేట, జమేదార్ పేట ఈద్గాల్లో ఈద్ ప్రార్థనలు నిర్వహించారు. హిందువులు, ముస్లిములు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొని మిఠాయిలు పంచుకున్నారు. ఈద్గాల్లో నమాజ్ ఏర్పాట్లను బాపట్ల అంజిమన్ ఎ ఇస్లామియా కమిటీ పర్యవేక్షించింది.

పంగులూరు: రంజాన్ పండుగను ముస్లింలు పంగులూరు మండలంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పంగులూరు, అలవలపాడు, రామకూరు, చిన్న మల్లవరం గ్రామాల్లో ముస్లింలు ఉదయం 9 గంటలకల్లా ఈద్గాల దగ్గరికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పంగులూరులోని మండల పరిషత్ కార్యాలయం వెనుక ఉన్న 50 సెంట్ల స్థలాన్ని వైసీపీ అద్దంకి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య ప్రార్థనలు నిర్వహించుకోవడానికి ముస్లింలకు కేటాయించటంతో ఈ సంవత్సరం రంజాన్ ప్రార్థనలు అక్కడ నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు కృష్ణ చైతన్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇమామ్ అబూబకర్ సిద్ధిక్ మాట్లాడుతూ, రంజాన్ పండుగను ప్రేమ, త్యాగం, అనుబంధాలకు మారుపేరుగా ముస్లిములు జరుపుకోవాలని అన్నారు. పేదల పట్ల ఆప్యాయత, అనురాగం నిండి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ముస్లిం యువకులందరూ ఒకరినొకరు ఆ లింగం చేసుకుని, రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

అద్దంకి: రంజాన్ పండుగను ముస్లిములు భక్తిశ్రద్ధలతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జరుపుకున్నారు. ఈ సందర్భంగా అద్దంకి పట్టణంలో భవాని సెంటర్, సింగరకొండ రోడ్డు, మేదరమెట్ల రోడ్డులోని ఈద్గాల వద్ద ముస్లిములు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ పండుగను పాటించే గృహాలలో నెల రోజులు కఠోర ఉపవాస దీక్షల తరువాత ఈ ప్రత్యేక ప్రార్థనలు జరుపుకున్నారు. మండలంలోని మణికేశ్వరం గ్రామంలో ఎస్‌కె కరీముల్లా ఆధ్వర్యంలో ముస్లిములు అల్లాను ఆరాధిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అల్లాహు రక్షణ కరుణ పొందాలని లక్ష్యంతో ఈ రంజాన్ పండుగ దిన ప్రత్యేక

అద్దంకిలో చిన్నారుల ఆలింగనం

బాపట్ల ఇస్లాంపేట ఈద్గాలో రంజాన్ నమాజ్

ప్రార్థనలు జరుపుకుంటామని మతపెద్దలు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ ఫిత్రా మరియు జకాత్ రూపంలో ఉన్నదానిలో ఎంతో కొంత దానధర్మాలు చేస్తారన్నారు. సేవా దృక్పథానికి, సహనానికి ప్రతీకగా జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని ముస్లిములు భారీ సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.

భట్టిప్రోలు: పవిత్ర రంజాన్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. అద్దేపల్లి పెద్ద మజీద్‌లో ముగింపు ఉపవాస దీక్షలలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. కో ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని మసీదు ఇమామ్, మౌజన్‌లకు మంత్రి నూతన వస్త్రాలను బహూకరించారు. ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. షాదీఖానాకు రూ.15 లక్షలు నిధులు కేటాయిస్తానన్నారు. అనంతరం మతపెద్దలు నాగార్జునను సత్కరించారు.

సంతమాగులూరు: మండలంలోని కొమ్మాలపాడు, ఏల్చూరు, సంతమాగులూరు, వెల్లలచెరువు, కొప్పరం, గ్రామాలలో రంజాన్ పర్వదినాన్ని ముస్లిములు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండలంలోని పలువురు ప్రజా ప్రతినిధులు ముస్లిములకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయా మసీదుల వద్ద పేదలకు దానధర్మాలు చేశారు. ప్రార్థన అనంతరం ఎస్ఐ ఎంవి శివకుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివకుమార్ ముస్లిములకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇంకొల్లు రూరల్: రంజాన్ పండుగను ముస్లిములు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు జరుపుకున్నారు. అక్సా మసీదు, మక్కా మసీదుల్లో ఉదయాన్నే పండుగ ప్రార్థనలు జరుపుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం దాహెరా (శ్మశాన వాటిక) వద్ద తమ పూర్వీకుల పవిత్ర ఆత్మ శాంతి కోసం

పంగులూరులోని ఈద్గా వద్ద ముస్లిముల ప్రార్థనలు

ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మార్టూరు రూరల్: ముస్లిములకు అత్యంత పవిత్రమైన రంజాన్ పండుగను మార్టూరు, బొబ్బేపల్లి, ద్రోణాదుల, చిమ్మిరిబండ, వలపర్ల గ్రామాలలో వేడుకగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచే పరస్పర అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఈద్గాల వద్ద మతపెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మార్టూరు వ్యవసాయ యార్డులో పెద్ద సంఖ్యలో ముస్లిములు ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్టూరుకు చెందిన గడ్డం మస్తాన్‌వలి ఇటీవల బాపట్ల జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మార్కెట్ యార్డ్‌లో స్థానిక ముస్లిం నాయకులు, మతపెద్దలు ఘనంగా సన్మానించారు.

రేపల్లె: రంజాన్ పర్వదిన వేడుకలు పట్టణంలో ముస్లిములు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గత నెల రోజులుగా చేస్తున్న ఉపవాస దీక్షలు నేటితో విరమించారు. పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం అయిన నాటి నుంచి ఖురాన్ గ్రంథ పారాయణం చేస్తూ, పేదలు, అవసరతలో ఉన్నవారికి దానధర్మాలు చేస్తూ శనివారం రోజు రంజాన్ పండుగను జరుపుకున్నారు. ముస్లిములు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అల్లా నామస్మరణ చేస్తూ పట్టణంలోని ఉయ్యూరు వారిపాలెం రోడ్డులో ఉన్న ఈద్గా వద్దకు చేరుకుని రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఈద్గా కమిటీ ప్రెసిడెంట్ షేక్ జమీర్, మొహిద్దీన్, బుడా చైర్మన్ దేవినేని మల్లికార్జున రావు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

బల్లికురవ రూరల్: రంజాన్ పర్వదిన వేడుకలు మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లిములు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గత నెల రోజులుగా చేస్తున్న ఉపవాస దీక్షలను విరమించారు. అల్లా నామస్మరణ చేస్తూ మండలంలోని బల్లికురవ, గుంటుపల్లి, వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం, వైదన, కొప్పెరపాడు, ముక్తేశ్వరం, చెన్నుపల్లి, కొనిదెన గ్రామాల్లో ఈద్గా మసీదుల వద్దకు చేరుకుని రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

భట్టిప్రోలు మండలంలో మతపెద్దలకు వస్త్రాలు అందజేస్తున్న మంత్రి నాగార్జున

సంతమాగులూరులో ఎస్ఐ శివకుమార్‌ను సన్మానిస్తున్న ముస్లిములు

మార్టూరులో ముస్లిముల రంజాన్ ప్రార్థనలు

అప్పుడెందుకు చొక్కా విప్పలేదు?

మంత్రి సురేష్‌ను ప్రశ్నించిన టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

దళితులకు సంబంధించి 27 పథకాలను రద్దు చేస్తే నువ్వు ఎందుకు చొక్కా విప్పలేదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మంత్రి సురేష్‌ను ప్రశ్నించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. దళితులు నష్టపోతుంటే ముఖ్యమంత్రికి చెప్పి వారికి ఎందుకు న్యాయం చేయలేదన్నారు. కరోనా కాలంలో డాక్టర్ సుధాకర్ మాస్కులు అడిగితే ఆయన్ను విశాఖ బజారులో అర్ధనగ్నంగా ఉంచి బూటు కాళ్లతో తన్నితే.. ఆ రోజు నువ్వు చొక్కా ఎందుకు విప్పలేదని ప్రశ్నించారు. దళితులను మనుషులుగా చూసే మనస్తత్వం నీది కాదని, నీ ఇంటి ముందు దళితులను చెప్పుతో కొట్టిన ఘటన గుర్తుందా? అని అడిగారు. అలాంటి వాటికి స్పందించకుండా కేవలం జగన్ మెప్పు పొందేందుకే

మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఇలాంటి అలజడి సృష్టించావని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చేకూరి సుబ్బారావు, శనగా నారాయణరెడ్డి, చిట్టేళ వెంగళరెడ్డి, షేక్ వలి, గురిజేపల్లి జిలాని, పయ్యావుల ప్రసాద్, కామేపల్లి వెంకటేశ్వర్లు, మంత్రూ నాయక్, షేక్ మస్తాన్‌వలి, మెడబలిమి అచ్యుతరావు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

సిఐటియు జిల్లా నాయకుడు జివి.కొండారెడ్డి

ప్రజాశక్తి-పిసిపల్లి

ప్రభుత్వ రంగ సంస్థలలో పని చేస్తున్న వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా నాయకుడు జివి.కొండారెడ్డి తెలిపారు. సిఐటియు మండల కమిటీ సమావేశం విజయకుమారి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలు ఇవ్వాలన్నారు. సెల్ ఫోన్ యాప్‌ల భారం కూడా తగ్గించాలన్నారు. యాప్‌ల భారం వలన ఉద్యోగులు

మాట్లాడుతున్న జివి.కొండారెడ్డి

మానసికంగా ఇబ్బందిపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1వ తేదీన జీతాలు చెల్లించకపోవడంతో ఇఎంఐలు సకాలంలో చెల్లించకలేక అదనపు వడ్డీ చెల్లించాల్సి వస్తుందన్నారు. ఉద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెరుగుతున్న కూరగాయలు, గ్యాస్ ధరలకు అనుగుణంగా రేట్లు పెంచాలన్నారు. ఆటో కార్మికులకు ట్యాక్స్‌లు తగ్గించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీలు అధికంగా ఉండటం వలన చేసే వారిపై అదనపు భారం పడుతుందన్నారు. ప్రభుత్వం రంగ సంస్థల్లోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గత అయిదు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్వచ్ఛభారత్ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో సఫలారెడ్డి, పి. నారాయణమ్మ, ఐతమ్మ, యేసుబాబు, భాగ్యమ్మ, గుంటగాని ప్రభాకర్, నందా లక్ష్మీనారాయణ, అంగన్‌వాడీ, ఆశా, విఆర్‌ఎ, విఒఎ, ఆటో, తాఫి, మధ్యాహ్నా భోజనం, ఉపాధిహామీ పథకం సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌ఎల మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

గ్రామ రెవెన్యూ సహాయకుల జిల్లా 8వ మహాసభను జయప్రదం చేయాలని నేతలు కోరారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 25న ఉదయం 10 గంటలకు ఒంగోలు సిఐటియు కార్యాలయంలో విఆర్‌ఎల సంఘ జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బాలకాశి ,రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. పెద్దన్న హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రకాశం జిల్లా పరిధిలోని 38 మండలాలకు చెందిన కమిటీ సభ్యులు ఈ మహాసభలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. మహాసభలో విఆర్‌ఎల సమస్యలు చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలను తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కమిటీని ఎనుకోనున్నారు. వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, విఆర్‌ఎల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

లాల్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-పొదిలి

పేదల ఆకలి తీర్చేందుకు లాల్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. స్థానిక చిన్న బస్టాండ్ సెంటర్‌లోని మసీదు వద్ద లాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి రోజు పేదలకు ఆహారం అందిండచం ఎంతో వ్యవ ప్రయాలతో కూడిన విషయమని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమం కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లాల్ ఫౌండేషన్ అధినేత ఆకీబ్ అహమ్మద్, ముల్లా జిలానీ బాషా, షేక్ షర్మిల, మస్తాన వలి తదితరులు పాల్గొన్నారు.

లస్సీపంపిణీ

రంజాన్ పండుగ సందర్భంగా పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల పాత ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు లస్సీ పంపిణీ చేశారు. లస్సీ స్టాల్‌ను పొదిలి సిఐ రాఘవేంద్రరావు, పొదిలి ఎస్ఐ మల్లికార్జున, కొనకనమిట్ల ఎస్ఐ దీపిక ప్రారంభించారు. హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా ఫొటోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమని సిఐ అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు రావూరి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు రాయల్, ట్రెజరర్ అశోక్, సెక్రెటరీ వెంకట్రావు, సభ్యులు శ్రీను, చలపతి, బాల ప్రసాద్, కష్ణ, వి. శ్రీను, మల్లి, శివ, వెంకటేశ్వర్లు, సూరి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

లస్సీ ప్యాకెట్లు అందజేస్తున్న సిఐ

మలబార్‌లో 'ఆర్టి స్ట్రీ' బ్రాండెడ్ జ్యువెలరీ

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఒంగోలులోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో ఈనెల 21 నుంచి 24వరకు 'ఆర్టిస్ట్రీ' బ్రాండెడ్ జ్యువెలరీ షో నిర్వహిస్తున్నట్లు మలబార్ స్టోర్ హెడ్ మైఖేల్ మనోజ్ తెలిపారు.ఈ సందర్భంగా విశిష్ట ఆభరణాల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మలబార్‌లో ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువలరీ షోను ఒంగోలు అర్బన్ డెవల ప్‌మెంట్ అథారిటీ (ఒడా) చైర్మన్ శింగరాజు మీనా కుమారి శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా స్టోర్ హెడ్ మైఖేల్ మనోజ్ మాట్లాడుతూ జ్యువలరీ షోలో భాగంగా బంగారం, వజ్రాభరణాలు, జాతి రత్నా భరణాలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆభరణాలు అద్వితీయమైన కళానైపుణ్యతతో అంతులేని హుందాతనంతో కూడినవిగా పేర్కొన్నారు. షోలో ప్రత్యేక ఆకర్షణగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ బ్రాండుల సమాహారం 'మైన్' ధృవీకరించిన వజ్రాభరణాలు, వివాహం, పార్టీ సంబరాల కోసం 'ఎరా' అన్కట్ వజ్రాలతో పొదిగిన విశిష్ట శ్రేణి 'ప్రెష్యా' జాతిరత్నాల సముదాయం, 'ఎతిక్స్' హస్తకళా నైపుణ్యతతో తయారైన ఆభరణాలు 'జోల్' అధునాతన డిజైన్‌లతో తేలికపాటి ఆభరణాలను ఇష్టపడే మగువల మనసు దోచుకుంటాయని తెలిపారు. తమ షోరూం ముప్పై ఏళ్ల వేడుకల్లో భాగంగా ప్రతి రూ.30 వేల కొనుగోలుపై 100 మిల్లి గ్రాముల బంగారు నాణేనానికి సమానమైన విలువ, డైమండ్, జెమ్‌స్టోన్, పోల్కీ డిజైన్ల ఆభరణాల కొనుగోలుపై 250 మిల్లీ గ్రాముల బంగారు నాణేనికి సమానమైన విలువ పొందవచ్చని తెలిపారు. ఈ ఆఫర్ ఈనెల 30 వరకు వర్తిస్తుందని చెప్పారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ నిబద్ధతలో భాగంగా తమ వినియోగదారులకు 10 నాణ్యమైన వాగ్దానాలను అందిస్తున్నట్లు తెలిపారు. తమ సంస్థ తన వార్షిక ఆదాయం నుంచి కొన్ని సామాజిక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఆరోగ్యం, ఉచిత విద్య, నిరుపేదలకు గృహనిర్మాణం, మహిళా సాధికారిత, పర్యావరణ రక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ ఆభరణాల విక్రయ వ్యాపారంలో ఓ ప్రత్యేకతను ఏర్పరుచుకొని ఇండియా, సింగపూర్, జిసిసి, యూఎస్ఎ దేశాలలో 300కి పైగా షోరూంలతో విస్తరించుకొని ముందుకు సాగుతోందని తెలిపారు.

జ్యువెలరీ షోను ప్రారంభిస్తున్న మీనా కుమారి

ఐనాబత్తిని వెంకయ్యకు ఘన నివాళి

300 మందికి అన్నదానం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కర్నూలు రోడ్డులోని శ్రీత్రిపురా కాంప్లెక్స్‌లో ఐనాబత్తిని వెంకయ్య సంతాప సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వెంకయ్య చిత్ర పటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యు లకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో మున్సిపల్ మాజీ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, పేల పోలు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రామకష్ణ పరమహంస, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మారెళ్ళ వివేకానంద, అయినా బత్తిన ఘనశ్యామ్, ప్రభాకర్‌రావు, మాజీ కౌన్సిలర్ పి. బ్రహ్మానందం, కె. విశ్వసేన్ ఉన్నారు.

300 మందికి అన్నదానం

ఐనా బత్తిని వెంకయ్య సంతాప సభను పురస్కరించుకొని ఆయన కుమారులు పవన్ కుమార్, గోపీకృష్ణ శివం ఫౌండేషన్ ద్వారా 300 మంది అనాధలు, యాచకులకు, రిమ్స్ హాస్పిటల్‌లోని రోగులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూల్ రోడ్డు షాపు ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ ఒంగోలు నగరప్రజలకు సుపరిచితులైన ఐనాబత్తిని వెంకయ్య అనారోగ్యంతో మరణించడం బాధాకరమన్నారు. శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి మాట్లాడుతూ అన్నదానం ద్వారా వెంకయ్య ఆత్మకు శాంతి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐనాబత్తిని వెంకయ్య కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాసరావు

స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని

పేదల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. 32వ డివిజన్ రాజీవ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలినేని ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం బాలినేని మాట్లాడుతూ ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. పేదల సంక్షేమమే ధ్యేయంగాముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు,స్థానిక కార్పొరేటర్ తాడి కృష్ణలత, వైసిపి నాయకులు ఓగిరాల వెంకట్రావు, కోసూరి శేఖర్, తోటపల్లి సోమశేఖర్, నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం....

44వ డివిజన్ కార్పొరేటర్ గోపిరెడ్డి గోపాలరెడ్డి ఆధ్వర్యంలో కర్నూలు రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ముస్లింలకు పానీయాలు పంపిణీ....

రంజాన్ పండుగ సందర్భంగా కొణిజేడు బస్టాండ్‌లోని ఈద్గా వద్ద నమాజ్ కోసం వచ్చిన ముస్లిలకు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మజ్జిగ, బాదంపాలు, తాగునీరు పంపిణీ చేశారు. అందజేశారు. ఈ కార్యక్రమాన్ని వైసిపి మైనార్టీసెల్ నాయకులు జలీల్, కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్, అజీస్ పర్యవేక్షించారు.

కొండపిలో....

కొండపి : ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని నెన్నూరుపాడు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు గడప గడపకూ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మారెడ్డి వెంకటేశ్వర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటయ్యకు నివాళి

ప్రజాశక్తి- సంతనూతలపాడురూరల్

సంతనూతలపాడు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు నలగట్ల సుబ్బారావు తండ్రి నలగట్ల కోటయ్య దశదిన కర్మ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొని కోటయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో టిడిపి ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నూకసాని బాలాజీ, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి టి. అనంతమ్మ టిడిపి రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, టిడిపి మంల అధ్యక్షులు మద్దినేని హరిబాబు, నాయకులు తన్నీరు శ్రీనివాసరావు, రంపతోటి అంకారావు, రావులపల్లి సురేష్ బాబు, నారాయణస్వామి చౌదరి, శంకర్ చెరుకూరి, శ్రీనివాసరావు, తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు ఎన్.మాధవీలత తదితరులు ఉన్నారు.

వాడవాడలా రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రంజాన్ పర్వదినం సందర్భంగా కొణిజేడు ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొనే ముస్లింలకు టిడిపి ఆధ్వర్యంలో కూల్ డ్రింక్స్ పంపిణీ చేశారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ దామచర్ల జనార్ధన్ గారి ఆదేశాల మేరకు 29వ డివిజన్‌లో అధ్యక్షుడు పెద్దిశెట్టి చంద్ర, తెలుగునాడు అంగన్‌వాడీ, డ్వాక్రా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దిశెట్టి వరలక్ష్మి ఆధ్వర్యంలో ఫ్రూట్ జ్యూస్ డబ్బాలు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు కోటారి నాగేశ్వరావు , రాష్ట్ర టిడిపి మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ కపిల్ బాషా, ఎఎంసి మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి దాయినేని ధర్మా, టిడిపి నాయకులు బండారు మదన్, శశికాంత్ భూషణ్, ఉండవల్లి రాము, నావూరి కుమార్, జాకీర్ ఖాన్

ఒంగోలులో కూల్ డ్రింక్స్ అందజేస్తున్న టిడిపి నాయకులు

తదితరులు పాల్గొన్నారు. **పొన్నలూరు :** మండల పరిధిలోని పొన్నలూరు, జడ్.మేకపాడు, కె.అగ్రహారం, బోదనపాడు, చెన్నుపాడు, మాలపాడు గ్రామాల్లోని ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆలింగణం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గాల వద్ద నమాజ్ చేశారు. **టంగుటూరు :** ముస్లిం సోదరులు రంజాన్ పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న పెద్ద మసీదు, ఫైర్ ఆఫీస్ పక్కన ఉన్న ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం మత పెద్ద నసీం మౌలానా ఉపన్యాసం ఇచ్చారు. వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు, ఎస్ఐ షేక్ ఖాదర్ బాషా, వైసిపి ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు రంజాన్ వేడుకల్లో పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాక్షాంక్షలు తెలిపారు. **ఎద్దదోర్నాల :** మండల పరిధిలోని పెద్దదోర్నాల, పెద్దబొమ్మలాపురం, వైచెర్లోపల్లి, చిన్న దోర్నాల, కటకానిపల్లి గ్రామాల్లోని ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఈద్గాల వద్ద ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **యర్రగొండపాలెం :** ముస్లిం సోదరులు రంజాన్ సందర్భంగా ఈద్గా వద్ద ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొని ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ తెలిపారు. చిన్నా రులతో కరచాలనం చేశారు.. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్‌గౌడ్, జడ్‌పిటి చేదూరి విజయభాస్కర్,జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్ బాషా, ముస్లిం మత పెద్ద సయ్యద్ మహ్మద్ ఇస్మాయిల్ హిదయతుల్లా మౌలానా, అష్రఫ్ అలి, సర్పంచి రామావత్ అరుణాబాయి, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు. **వెలిగండ్ల :** మండల పరిధిలోని మొగుళ్ళూరు, వెలిగండ్ల, జంగం నరసాయిపల్లి, చోడవరం గ్రామాల్లోని ముస్లింలు రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక నమాజ్‌లు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **త్రిపురాంతకం :** ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈద్గా వద్ద ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **కొండపి :** రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద నమాజ్ నిర్వహించారు. నమాజ్‌లో కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, టిడిపి రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్య పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. **దొనకొండ:** ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గా వద్ద ప్రత్యేక నమాజ్ చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు దాన ధర్మాలు చేశారు. **మద్దిపాడు :** రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగమనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **కంభంరూరల్ :** రంజాన్ పర్వదినం సందర్భంగా ఈద్గా మైదా నంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు శాఖ స్నేహం ఫౌండేషన్, ముస్లిం యూత్ ఆధ్వర్యంలో జ్యూస్, మజ్జిగ పంపిణీ చేశారు. **పొదిలి :** ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గా వద్ద ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించారు. అనంతరం ముస్లింలు ఒకరిఒకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **కనిగిరి :** రంజాన్ పర్వదినాన్ని పురష్కరించుకొని ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ ప్రార్థనల్లో కనిగిరి ఎమ్మెల్యే బుర్రామధుసూదన్‌యాదవ్ ,మాజీ ఎమ్మెల్యే, టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **చీమకుర్తి :** చీమకుర్తిలో రంజాన్ పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఈద్గా వద్ద ముస్లింలు నమాజ్ చేశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆలింగం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **దర్శి :** రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టరు డాక్టర్ ఎస్ఎం.బాషా, అమాన్‌ఉల్లాఖాన్, హుస్సేన్, మిల్లర్ బుజ్జి, రహంతుల్లా పాల్గొన్నారు.

యర్రగొండపాలెంలో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి సురేష్

కొండపిలో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే స్వామి

ఒంగోలులో కూల్ డ్రింక్స్ అందజేస్తున్న వైసిపి నాయకులు

గ్రామాల్లో అంధకారం

ప్రజాశక్తి- కొమరోలు

మండలపరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలులకు పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ వైర్లు తెగిపోయాయి. ఫలితంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో పలు గ్రామాలు అంధకారం నెలకొంది. విద్యుత్ సరఫరా లేక పోవడంతో రాత్రి సమయంలో ప్రజలు అల్లాడిపోయారు. ఉక్కపోత, దోమలతో రాత్రంతా జాగారం చేసినట్లు ప్రజలు తెలిపారు. కొమరోలు బీసీకాలనీలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురైనట్లు కాలనీ వాసులు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది స్పందించి యుద్ధ ప్రాతిపదికన దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను తొలగించి నూతన స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- కొమరోలు

మండల పరిధిలోని ఇడమకల్లు క్రాస్ రోడ్డు వద్ద అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ పెద్దలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ వేసవిలో పాదచారులు, వాహన దారులు చలికేంద్రాన్ని వినియోగించు కోవాలని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, అంబేద్కర్‌యూత్ సభ్యులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా అందజేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జమాత్ ఇస్లామీ హింద్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఉమర్ బిన్ ఖత్తాబ్ మసీదు వద్ద పేదలు, వింతంతువులకు రంజాన్ తోఫా కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జమాత్ ఇస్లామి హింద్ పట్టణ అధ్యక్షుడు షేక్ రసూల్, సభ్యులు సలీం, గఫార్, అతహర్‌బాషా, మహిళా విభాగం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-కొండపి

కొండపి పంచాయతీ పరిధిలోని ముక్కోటిపాలెం గ్రామంలో టిడిపి నాయకులు ముక్కు ప్రసాదు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ నాగర్పమ్మ తల్లి మంచి నీటి ప్లాంట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్య మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో అధునాతన పరికరాలతో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జి.రామయ్య చౌదరి, బత్తుల నారాయణ స్వామి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కాలేషా, నన్నూరి సుబ్బరామయ్య, ఆర్.మధుసూదనరావు, సోమయ్య, వసంతరావు పాల్గొన్నారు.

ఓట్ల పరిశీలనపై శిక్షణ

ప్రజాశక్తి-దర్శి

వచ్చే ఎన్నికలలో టిడిపి విజయదుందుభి మ్రోగిస్తుందని, నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అవుతారని టిడిపి నియోజకవర్గ పరిశీలకులు నల్లపాటి రామచంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బూత్ కమిటీ సభ్యులకు ఆర్‌డిఎస్ ఓటు వెరిఫికేషన్ పై శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ చంద్రప్రసాద్ మాట్లాడుతూ బూత్ కమిటీ సభ్యులు గ్రామాలలో పటిష్టంగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ఓటు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయానికి అందరూ సమిష్టి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు, నగరపంచాయతీ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య, పార్లమెంట్ కోఆర్డినేటరు అరుణారెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, మండల అధ్యక్షుడు చిట్టె వెంకటేశ్వర్లు, ఓబుల్‌రెడ్డి, కె. శ్రీను, నెమిలయ్య, వెంకన్న, మారెళ్ల వెంకటేశ్వర్లు, సందు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-పొదిలి

మారుతున్న కాలానుగుణంగా ఆహార పద్ధతులు మారడంతో అనుకోకుండా వచ్చే గుండెపోటు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పొదిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ హరీష్ తెలిపారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో ఆజాదికా అమత్ మహోత్సవ్ - ఐకానిక్ వారోత్సవాల్లో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేలం నిర్వాహణాధికారి జి. గిరి రాజ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరీష్ మాట్లాడుతూ గుండెపోటు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సిపిఆర్ టెక్నిక్ ద్వారా గుండె పోటు నుంచి ఎలా రక్షణ పొందవచ్చుననే అంశంపై ప్రయోగాత్మకంగా రైతులకు అవగాహన కల్పించారు. డీహైడ్రేషన్ కు కారణాలు, రక్షణ విధానాల గురించి వివరించారు. వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్యం -అవగాహన, మానసిక ఆరోగ్యం - ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు అకౌంట్స్ మేనేజర్ ఐ. రవికుమార్, ఫీల్డ్ ఆఫీసర్లు జి. రవిబాబు, కె.దుర్గా ప్రసాద్, రైతు సంఘం నాయకులు బీరం కష్ణా రెడ్డి, వివిధ గ్రామాల బోర్డు సిబ్బంది, రైతులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్నారికి అశోక్‌బాబు ఆశీర్వాదం

ప్రజాశక్తి-మర్రిపూడి

చిన్నారిని ఆశ్వీరదిస్తున్న వరికూటి అశోక్‌బాబు

పేదల జీవితాలలో వెలుగు నింపటమే ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని సన్నమూరు గ్రామంలో బోడిపోగు నాగేష్ కుమార్తె ఓణీల పంక్షన్ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అశోబాబు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం అశోక్‌బాబు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు, అగ్రవర్ణాలలోని పేదల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమి స్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చిమట సొసైటీ మాజీ అధ్యక్షుడు మొల్లల శివరామిరెడ్డి, వైసిపి యూత్ నాయకులు వనిపెంట మల్లికార్జున, అలికేపల్లి వెంకటరెడ్డి, ఉస్తేలమూరి చెన్నారెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖుల విగ్రహాలు ప్రారంభం

ఆవిష్కరించనున్న మంత్రి నాగార్జున

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండల కేంద్రం భట్టిప్రోలులోని బౌద్ధ స్థూపం ఎదురుగా నిర్మించిన ప్రముఖుల విగ్రహాలు ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. ఆదివారం ఉదయం వీటిని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జున చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు నిర్వహణ కమిటీ తెలిపారు. అనతి కాలంలోనే స్వామి వివేకానంద, అల్లూరి సీతారామరాజు, సుభాష్ చంద్రబోస్, గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు, శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహాల నిర్మాణాలు రూపుదిద్దుకోవటం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వీటి ప్రారంభోత్సవానికి మంత్రితో పాటు బాపట్ల ఎంపి నందిగం సురేష్, జిల్లా పరిషత్ చైర్మన్ హెన్రీ క్రిస్టీనా, బాపట్ల జిల్లా అర్బన్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొననున్నట్లు చెప్పారు.

భట్టిప్రోలులో ప్రారంభానికి సిద్ధమైన విగ్రహాలు

అనుమతిలేని విగ్రహాల ప్రారంభోత్సవానికి మంత్రా?

భట్టిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గేటు పక్కన ఆర్అండ్బి స్థలంలో నిర్మించిన ప్రముఖుల విగ్రహాల ప్రారంభోత్సవానికి రాష్ట్ర మంత్రి మెరుగు నాగార్జున రావటం పట్ల పలువురు ఆక్షేపిస్తున్నారు. భట్టిప్రోలు బస్టాండ్ సెంటర్ నుంచి చావలి సెంటర్ మీదుగా అద్దేపల్లి మజీద్ సెంటర్ వరకు ఉన్న ఆర్అండ్బి ఆక్రమణలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఎదురు ఎదురుగా వచ్చే వాహనాలు తప్పుకోవటానికి కూడా ఖాళీ లేక వాహన చోదకులు ఇబ్బందులు అంతాఇంతా కాదు. రహదారిని విస్తరించేందుకు కొలతలు చేపట్టాలని సాక్షాత్తూ మంత్రి నాగార్జున సర్వే చేయించారు. కానీ ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు సర్వే ఊసే లేదు. మంత్రి చొరవతో రహదారి విస్తరణకు ఆటంకాలు తొలగిపోతాయని ప్రజలంతా భావించారు. కానీ ఆ చొరవ అనుమతి లేని ఆటంకంగా మారనున్న ప్రాంతంలో నిర్మించిన విగ్రహాల నిర్మాణంలో మంత్రి చొరవ చూపటం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగా అనుమతి లేకుండా నిర్మాణాలలో ఇదే ప్రాంతంలో వైద్యశాల గేటుకు మరో వైపు ముస్లిములు అబ్దుల్ కలాం, అబుల్ కలాం ఆజాద్ విగ్రహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎవరికి వారు ఈ విధంగా అధికారం ఉంది కదా అని ఆక్రమించుకుంటూపోతే అభివృద్ధి ఎక్కడ జరుగుతుందని ప్రశ్నిస్తున్నారు. ఆక్రమణలు తొలగించాల్సిన ప్రజాప్రతినిధులే ఆక్రమణదారులకు అండగా నిలుస్తుంటే అధికారులు మాత్రం ఏమి చెయ్యగలరని చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై ఆర్అండ్బి డిఈ చంద్రారెడ్డి మాట్లాడుతూ భట్టిప్రోలులో నిర్మించిన విగ్రహాలకు ఎలాంటి అనుమతులు లేవని అన్నారు. జిల్లా కలెక్టర్ సారథ్యంలో అన్ని శాఖల జిల్లా ఉన్నతాధికారులు చర్చించి ఏకాభిప్రాయంతో అనుమతి పొందాల్సి ఉందన్నారు. అది కూడా సంబంధిత శాఖ ద్వారా సిఫారసు చేయాల్సి ఉందన్నారు. విగ్రహాలు నిర్మించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సేవ చేయటంలోనే నిజమైన ఆనందం

- పద్మ భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఘంటా అనిల్ - ముస్లిం మహిళలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చీరాల

ఆపదలో ఉన్న వారి అవసరాలను గుర్తించి ఆర్థికంగా చేయూతనందించటంలోనే నిజమైన ఆనందం ఉంటుందని పద్మ భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఘంటా అనిల్ కుమార్ అన్నారు. రంజాన్ పండగను పురస్కరించుకొని పట్టణంలోని ఏరియా వైద్యశాల సమీపంలో ఉన్న ఎల్బిఎస్ నగర్లో ఉన్న 25 మంది పేద ముస్లిం మహిళలకు పద్మ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘంటా సుబ్బారాయుడు నాగమ్మ, మరియు చాగంటి జింకయ్య రత్తమ్మల జ్ఞాపకార్థం చిరు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాల నుంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద ముస్లిములకు రంజాన్, మొహరం పండగల సందర్భంగా వారి పవిత్ర ఉపవాస ప్రార్థన సమయాలలో తనకు ఉన్న దానిలో కొంత ఆర్థిక సాయాన్ని అందజేయడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ పేదల కష్టాలను గుర్తించి వారికి చేయూతనందిస్తూ సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు.

సాయం అందిస్తున్న దృశ్యం

కామ్రేడ్ లెనిన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

సిపిఐ (ఎంఎల్) రెడ్‌స్టార్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బాపట్ల జిల్లా కార్యదర్శి మేకా ఇర్మియా అధ్యక్షతన శనివారం మార్టూరులో వేడుకగా నిర్వహించారు. ముందుగా కామ్రేడ్ లెనిన్ చిత్రపటానికి ఏఐఆర్ డబ్ల్యుఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సుజాత పూలమాల వేసి నివాళి అర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ మహ్మద్ బాషా మాట్లాడుతూ... ప్రతిఘాతక పాలనను కూలదోసి ప్రజాస్వామ్యం, సోషలిజం వైపు ప్రతి ఒక్కరూ పయనించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ బాపట్ల జిల్లా నాయకులు పి ఇశ్రాయేలు, కుల నిర్మూలన ఉద్యమం నాయకులు శ్రీనునాయక్, గద్దె రామారావు, జాన్‌వెస్లీ, ఆజ నేయులు, ఏఐఆర్ఎస్ఓ నాయకులు క్రాంతి సీమ, తస్లీమా నస్రీన్, నాయకులు పఠాన్ వలి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

మేలిరకం విత్తనాలతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

వ్యవసాయ రంగంలో రైతులు ముందుగా మేలిరకం విత్తనాల ఎంపిక ద్వారానే అధిక దిగుబడులు సాధించుకోగలరని గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఐలవరం గ్రామంలో నక్కా శ్రీనివాసరావు అనే కౌలు రైతు పొలంలో శనివారం నూజివీడు సీడ్స్‌కు చెందిన విన్నర్ మొక్కజొన్న పంటపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ కంపెనీ విత్తనాలతో ఒక సెంటు భూమిలో కోత ప్రయోగం చేపట్టగా సరాసరి ఎకరాకు 39 క్వింటాళ్ల దిగుబడిని సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సర్పంచ్ మాట్లాడుతూ ఈ ఏడాది కురిసిన అకాల వర్షానికి మొక్కజొన్న పంటలు దెబ్బతిని పూర్తిగా దిగుబడులు తగ్గిపోయాయని అలాంటి పరిస్థితిలో నూజివీడు సీడ్స్ చెందిన విత్తన రకం రైతులకు మేలు చేసేవిధంగా అననుకూల వాతావరణ పరిస్థితులను తట్టుకుని అధిక దిగుబడులు సాధించటం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మురుగుడు శ్రీనివాసరావు, మాజీ ఎంపిటిసి గద్దం శ్రీనివాసరావు, కంపెనీ రీజనల్ మేనేజర్ సిహెచ్ భాస్కర్, సిబ్బంది పోతురాజు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

దళితవాడలో పేరుకుపోయిన మురుగు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండల కేంద్రం భట్టిప్రోలులోని అద్దేపల్లి దళితవాడలో మురుగు నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులకు విన్న వించినా పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు. భట్టిప్రోలు పంచాయతీలో రెండు సచివాలయాలు ఉండగా సచివాలయం-1 పరిధిలో మాత్రమే పారిశుధ్య కార్మికులతో వీధులు శుభ్రం చేయిస్తున్నారని, సచివాలయం-2 పరిధిలో ఉన్న అద్దేపల్లిలో వారానికి ఒకసారి కూడా వీధులు శుభ్రం చేయటం కానీ, మురుగు కాలువల పూడిక తీత పనులు గాని చేపట్టటం లేదని వాపోతున్నారు. పాలకవర్గ సభ్యులు ఎవరికివారు వారి వారి వార్డులలో కార్మికులను ఒత్తిడి చేసి మరీ పనులకు పురమాయించుకుంటున్నారని, దీని వలన శానిటరీ మేస్త్రీల ప్రణాళిక ప్రకారం పనులు జరగటం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇదిలావుండగా భట్టిప్రోలుకు గత కొన్ని రోజులుగా ఎలాంటి కార్యదర్శి లేకపోవటం గమనార్హం. కార్యదర్శి లేకపోవటం, పాలకవర్గంలో ఆధిపత్య పోరు, వర్గ విభేదాలతో పంచాయతీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇన్‌ఛార్జి కూడా లేకపోవటంతో వివిధ పనులపై సంతకాల కోసం వచ్చే ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. దీని కారణంగా పాలకవర్గంలో సమన్వయం లోపించి గ్రామంలో పాలన కుంటుపడటమే కాకా పారిశుధ్యం లోపించటానికి కారణమౌతుంది. పైగా పంచాయతీలో 25 మందికి పైగా ఉన్న కార్మికులలో పది మంది మాత్రమే ప్రతి రోజూ పారిశుధ్య పనులు చేస్తుంటారు. మిగిలిన వారిలో కొందరు వివిధ రకాల పనులు చెడుతుండగా, ఐదారుగురు సెలవు పెడుతుంటారు. ఎలాంటి పరిస్థితిలో సచివాలయం-2 పరిధిలో కొందరు కార్మికులను కేటాయిస్తే పని విభజన జరిగి గ్రామంలో అన్ని ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపడుతుందని ప్రజలు అంటున్నారు. ఆ మేరకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అద్దేపల్లిలో మురుగు కాలువ

మాజీ ముఖ్యమంత్రిపై దాడి సిగ్గుచేటు..

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

మాజీ ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుపై అధికార పార్టీకి చెందిన అల్లరిమూకలు దాడి చేయడం సిగ్గుచేటు అని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు అరవపల్లి అంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారమే మంత్రి ఆదిమూలపు సురేష్ ఎర్రగొండపాలెంలో చంద్రబాబుపై రాళ్లదాడి చేయించారని పేర్కొన్నారు. తాడేపల్లి ప్యాలెస్ కుట్రలో భాగంగా దళితులపై పలు దాడులు చేసినా అదే దళితులను వాడుకొని ప్రతిపక్ష నాయకులపై ఉసిగొల్పటం సిగ్గుచేటని ఆంజనేయులు అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో చేపట్టిన 27 దళిత పథకాలను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఇటువంటి ప్రభుత్వానికి మంత్రి సురేష్ మద్దతు పలుకుతూ చంద్రబాబుపై దాడికి దిగటం సిగ్గుచేటని మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి అంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కంటి ఆపరేషన్లు చేయించుకున్న వృద్ధులు

ఎన్ఆర్ఐ రాయిని సుబ్బరామయ్య దాతృత్వం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు మండలం దుద్దుకూరు గ్రామానికి చెందిన ఎన్నారై రాయిని సుబ్బరామయ్య దాతృత్వం చాటుకున్నారు. దుద్దుకూరు గ్రామంలో కంటి సమస్యలతో బాధపడుతున్న పేదలు 30 మందిని కిమ్స్ హాస్పిటల్‌లో చేర్పించి నాణ్యమైన చికిత్సతో కంటి శుక్లాలు, కంటి పొరల ఆపరేషన్లు చేయించి కళ్లజోళ్లు ఇప్పించారన్నారు. రాయిని సుబ్బరామయ్య తన మంచి మనసును చాటుకున్నారని దాతలు కొనియాడారు. ఈ కార్యక్రమానికి ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రఫీ, గ్రామపెద్ద చెన్నుపాటి జనార్దన్‌రావు సహాయ సహకారాలు అందించారన్నారు. భవిష్యత్తులో తను పుట్టిన గ్రామానికి మరెన్నో సేవలు అందిస్తానని రాయిని సుబ్బరామయ్య తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-రేపల్లె

మండలంలోని జంగాలపాలెం గ్రామంలో కామాక్షి ఐ కేర్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కారాని కృష్ణకుమారి కారాని శ్రీనివాసరావు ప్రారంభించారు. కామాక్షి ఐ కేర్ హాస్పిటల్ డాక్టర్ డి వాసుదేవరావు సేవలందించారు. వైద్య శిబిరంలో సుమారు 100 మందికి వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ తెలిపారు.

సభలో మాట్లాడుతున్న వక్తలు

ప్రతిభామూర్తుల సభ

ప్రజాశక్తి-అద్దంకి

పట్టణంలోని కేర్ అండ్ క్యూర్ హోమియో స్టోర్స్ ఆవరణలో శనివారం పిసిహెచ్ కోటయ్య అధ్యక్షతన ప్రతిభామూర్తుల సభ కార్యక్రమం జరిగింది. పట్టణానికి చెందిన దొప్పలపూడి హనుమంతరావు జ్ఞాపకార్థం వీరి కుమారుడు దొప్పలపూడి వెంకట దుర్గాప్రసాద్ ఈ కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించారు. నట చూడామణి కీర్తిశేషులు బండారు రామారావు నట జీవిత విశేషాలను రంగస్థలం నటుడు ఆలకుంట శ్రీనివాసరావు వివరించారు. త్రిపురనేని గోపీచంద్ రాసిన అసమర్ధుని జీవితయాత్ర పుస్తకాన్ని సాహితీ ప్రవంతి అధ్యక్షులు చందులూరి నారాయణరావు సమీక్షిస్తూ విశేషాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గాడేపల్లి దివాకర్ దత్తు, యు దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, మన్నం త్రిమూర్తులు, సినీ విశ్లేషకులు ఆర్‌వి రాఘవరావు, మోటుపల్లి రామదాసు, చప్పిడి వీరయ్య, నర్రా శ్రీలక్ష్మి, కొల్ల భువనేశ్వరి, సంగీత సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొని నివాళులర్పించారు. అసోసియేషన్ సెక్రటరీ ఎం హనుమంతరావు సభ్యులు యువి బ్రహ్మం పాల్గొన్నారు.

● మజ్జిగ పంపిణీ

రంజాన్ సందర్భంగా ఒంగోలు, రాజపానగల్ రోడ్డులో మాజీ కౌన్సిలర్ తూము సుబ్బారావు నేతృత్వంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం. - ప్రజాశక్తి, ఒంగోలు

పశ్చిమాన రాజకీయ వేడి

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పశ్చిమ ప్రాంత పర్యటన జిల్లాలో రాజకీయ వేడిని పెంచింది. మూడు రోజుల పాటు ఆయన జిల్లాలో ఉన్నారు. గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రాల్లో 'ఇదేంఖర్మ రాష్ట్రానికి' అనే పేరుతో నిర్వహించిన సభలు విజయవంతమయ్యాయి. సభలకు భారీగా జనం తరలివచ్చారు. అందుకు స్థానిక నేతలతో పాటు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, జిల్లా నేతలు అందరూ సమిష్టిగానే పనిచేశారు. గత ఎన్నికల్లో ఈ ప్రాంతంలో మూడు నియోజకవర్గాలు వైసిపికి దక్కాయి. నాలుగేళ్ల తర్వాత చంద్రబాబు ఈ మూడు నియోజకవర్గాల్లో వ్యూహాత్మకంగా సభలు నిర్వహించారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత కూడా తెలుగుదేశం నేతలకు కలిసి వచ్చింది. ఊహించిన దానికన్నా ఎక్కువగా జనం తరలివచ్చారు. పాలకపక్ష నేతల్లోనూ అంతర్మథనం మొదలైంది. గిద్దలూరులో నిర్వహించిన సభకు భారీగా జనం వచ్చారు. నియోజకవర్గంలో సమీకరణలపై కేంద్రీకరించారు. ఊరూరి నుంచి తరలివచ్చారు. స్థానిక ఎమ్మెల్యేపై వైసిపి ద్వితీయశ్రేణి నేతలే తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. దీంతో పార్టీలో సమన్వయం లేదు. ఇది కూడా కారణంగా చెబుతున్నారు. వైసిపికి ఓట్లేసిన జనం కూడా చంద్రబాబు సభలకు వచ్చినట్లు అంచనా వేస్తున్నారు. గిద్దలూరులో 15 వేల మందికి పైగానే వచ్చినట్లు సమాచారం. ఇన్‌ఛార్జి ముత్తుమల అశోక్‌రెడ్డి బాగా గ్రౌండ్‌వర్కు చేశారు. రోడ్‌షోలకు మంచి స్పందన వచ్చింది. మార్కాపురంలో చంద్రబాబు రెండు రోజులు బస చేశారు. చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు కూడా ఇక్కడే నిర్వహించారు. మరుసటి రోజున రైతులతో సమావేశం నిర్వహించారు. ముఖాముఖి పెట్టారు. అనేక అంశాలు చర్చకు తెచ్చారు. మార్కాపురంలో జనం కిక్కిరిసిపోయారు. అందుకు ఇన్‌ఛార్జి కందుల నారాయణరెడ్డి ఇటీవల కాలంలో గ్రామాల్లోనే తిరుగుతున్నారు. పాలకపక్ష నేతల భూ అక్రమాలను ఎండగట్టగలిగారు. ఇవి కూడా కలిసొచ్చాయి. మార్కాపుర సభకు గతంలో కన్నా భారీగా వచ్చారు. ఇక వైపాలెం విషయానికి వస్తే ఇక్కడా సభ విజయవంతమైంది. మంత్రి ఆదిమూలపు సురేష్ వ్యూహం ఫలించిందా? బెడిసికొట్టిందా? అనే చర్చ మొదలైంది. చంద్రబాబు దళితులకు క్షమాపణ చెప్పాలంటూ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. చంద్రబాబు రాగానే ఉద్రిక్తతలకు అక్కడ పరిణామాలు చోటుచేసుకున్నాయి. రాళ్ల దాడులు జరిగాయి. రెండు గ్రూపుల మధ్య ఘర్షణలు తలెత్తాయి. మంత్రి ఆదిమూలపు సురేష్ చొక్కా విప్పి సవాలు విసిరారు. అనంతరం జరిగిన సభలో చంద్రబాబు నేరుగా మంత్రి సురేష్‌ను హెచ్చరించారు. కుప్పిగంతులు వేయవద్దని హెచ్చరించారు. అక్కడే ఎరిక్షన్‌బాబును అభ్యర్థిగా ప్రకటించారు. దమ్ముంటే ఎరిక్షన్‌బాబుపై పోటీ చేసి గెలవగలవా? అని సవాలు విసిరారు. దీంతో ఇక్కడా రాజకీయం వేడెక్కింది. ఇక్కడ పరిణామాలు రాష్ట్రస్థాయిలో చర్చగా మారాయి. ప్రతిపక్ష నేత పర్యటనను అడ్డుకోవడం ఎంత మేరకు సమంజసం అనే చర్చ రాజకీయవర్గాల్లో మొదలైంది. దీనిపై వైసిపిలోనే మిశ్రమ స్పందన ఉంది. మంత్రి ఆదిమూలపు సురేష్ తలపెట్టిన కార్యక్రమానికి జిల్లాలో ఎమ్మెల్యేలు గానీ, సీనియర్ నేతలు గానీ వెళ్లలేదు. శనివారం నాడు ఆయన వైపాలెంలో విలేకర్ల సమావేశం పెట్టి.. తెలుగుదేశం కార్యకర్తలు తమపైనే దాళ్లదాడి చేశారని ధ్వజమెత్తారు. రాజకీయంగా మైలేజీ ఎంత మేరకు వచ్చిందనేదీ చూస్తే తెలుగుదేశంలో ఉత్సాహం పెరిగింది. చంద్రబాబు చేసిన ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. సిఎం జగన్ పాలనపై ధ్వజమెత్తారు. ధరలతో పాటు అన్ని రకాల అంశాలను ప్రస్తావించారు. అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని ప్రకటించారు. పథకాలు ఎత్తేస్తారనే వైసిపి విమర్శలకు స్పష్టత ఇచ్చారు. మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేస్తామని మూడు చోట్లా స్పష్టంగా చెప్పారు. వెలిగొండను పూర్తిచేస్తామని ప్రకటించారు. దీనిపై పెద్ద స్పందన లేదు. ఎందుకంటే వెలిగొండపై చంద్రబాబు పూర్తి నిర్లక్ష్యమే ప్రదర్శించారు. పైగా అక్టోబరులో దీన్ని ప్రారంభిస్తానని సిఎం జగన్ మార్కాపురంలోనే ప్రకటించారు. ఏదేమైనా ఈ రెండు ఎజెండాల్లో మార్కాపురం జిల్లా ఈ ప్రాంతంలో తెలుగుదేశం నేతలకు బాగా ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ఎన్నికల్లోనూ ఇదే నినాదంతో ముందుకు వెళ్లినా మంచి స్పందన వస్తుందని ఆశాభావంతో ఉన్నారు. ఇక వైసిపి నేతలు అంతర్మథనంలో పడ్డారు. మూడు చోట్లా ఎమ్మెల్యేలు చంద్రబాబు పర్యటనపై స్పందించారు. మంత్రి ఆదిమూలపు సురేష్‌తో పాటు ఇద్దరు ఎమ్మెల్యేలు మాట్లాడారు. విమర్శల దాడిచేశారు. ఏదేమైనా ఎదురుదాడిలో తడబాటుకు గురయ్యారు. పార్టీలో నేతల మధ్య ఉన్న విభేదాలు ఈ సందర్భంగా ప్రస్ఫుటమయ్యాయి. జిల్లా కేంద్రంలోనూ దీనిపై నేతలు స్పందించలేదు. ఏదేమైనా జిల్లాలో చంద్రబాబు పర్యటన రాజకీయంగా వేడిని పెంచింది.

రాళ్ల దాడిలో నిందితులకు

శిక్ష పడేలా చేస్తా..

- నేను భూఆక్రమణకు పాల్పడినట్లు రుజువు చేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా..
- చంద్రబాబు రెచ్చగొట్టడం వల్లే రాళ్ల దాడి
- రాష్ట్ర మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

'రాళ్లదాడి విషయంపై విచారణ జరిపించి.. నేరస్తులకు తగు శిక్ష పడేలా చేస్తా.. దాడి చేసిన వారిని గుర్తించాం. మేము శుక్రవారం రాత్రే ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్(ఐజీ)కు ఫిర్యాదు చేశాం. చంద్రబాబుపై కేసు పెట్టాల్సిందే. దాడి చేసిన వారిపై కూడా కేసులు పెట్టాల్సిందే..' అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. యర్రగొండపాలెంలో గంజాయి రవాణా అధికంగా ఉందని, తాను భూఆక్రమణలకు పాల్పడ్డానని టిడిపి అధినేత చంద్రబాబు ఆరోపించారని, తాను ఒక్క సెంటు భూమినైనా ఆక్రమించినట్లు రుజువు చేస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని చంద్రబాబుకు సవాల్ విసిరారు. శనివారం మార్కాపురంలో మీడియాతో, యర్రగొండపాలెంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తాము శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే అక్కడికి వచ్చి చంద్రబాబు వేలు చూపించారని, టిడిపి వారిని రెచ్చగొట్టడంతో వాళ్లు రాళ్లతో దాడి చేశారని చెప్పారు. రాళ్ల దాడిలో ముగ్గురు వైసిపి కార్యకర్తలకు గాయాలయ్యాయన్నారు. దళితులు ఏమి పీకుతారు? అని లోకేష్ అన్నారని, తాము ఏమి పీకుతామో చూపిస్తామన్నారు. రాళ్లదాడికి సంబంధించిన ఒక వీడియోను ఆయన మీడియా ముందుంచారు. మేము క్షమాపణ చెప్పండి అని అడగడం తప్పా.? అడిగినందుకు మీ కార్యకర్తలతో మా మీద రాళ్లదాడి చేయిస్తారా? అని ప్రశ్నించారు. దళితులకు క్షమాపణ చెప్పేంత వరకు మేము ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. మీరు ఎన్ని దాడులు చేసినా, మా రక్తం కళ్ల చూసినా, మరలా ఇంకోసారి కారంచేడు, చుండూరు లాంటి మారణహోమం చేస్తామని బెదిరించినా తాము దేనికైనా సిద్ధమని చెప్పారు. చంద్రబాబు ఏ ఆధారాలతో యర్రగొండపాలెంలో భూకబ్జాలు జరిగాయన్నారో తమకు తెలియాలన్నారు. 2014-19లో పార్టీ ఫిరాయింపులకు ఉసిగొల్పి ప్రజాప్రతినిధులను వారి పార్టీలో చేర్చుకున్నప్పుడు వారికి ఇచ్చిన తాయిలాలల్లో భాగమే ఈ భూకబ్జాలన్నారు. వీటిపై తాము ఖచ్చితంగా విచారణ చేపడతామన్నారు. మా మీద దాడి చేస్తే పచ్చ మీడియా చంద్రబాబుపై దాడి చేశారని రాసిందని, చంద్రబాబు వచ్చి యర్రగొండపాలెం శాంతియుత వాతావరణాన్ని కలుషితం చేశారని చెప్పారు. సమావేశంలో ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, యర్రగొండపాలెం, గంజవారిపల్లి సర్పంచ్ దుగ్గెంపూడి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కాన్వాయ్‌పై దాడి చేసిన

వైసీపీ రౌడీ మూకలను శిక్షించాలి

ఏఎస్పీకి టిడిపి వినతి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

యర్రగొండపాలెంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కాన్వాయ్‌పై వైసీపీ రౌడీ మూకల దాడిని ఖండిస్తూ.. ఇలాంటి ఘటనకు పాల్పడిన వారిని శిక్షించాలని కోరుతూ ఏఎస్పీ నాగేశ్వరరావుకి టిడిపి ముఖ్య నేతలు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, డోల బాల వీరాంజనేయస్వామి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు మాజీ శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, ఒంగోలు పార్లమెంటు అధ్యక్షులు నూకసాని బాలాజీ, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యేలు ఉగ్ర నరసింహారెడ్డి, దివి శివరాం, తెలుగుదేశం యువ నాయకులు దామచర్ల సత్య పాల్గొన్నారు.